

ఏకలవ్య పాఠశాలల్లో మాతృభాష టీచర్లను నియమించాలి

ప్రజాశక్తి-పెదబయలు : ఏజెన్సీలోని ఏకలవ్య పాఠశాలల్లో ఇంగ్లీష్‌తోపాటు మాతృభాష తెలుగు తెలిసిన ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయ నియామకాల్లో అవధి, పంజాబ్, భోజ్‌పురి, రాజస్థాన్ వంటి ఉత్తర భారత రాష్ట్రాల నుంచి కనీసం తెలుగు మాట్లాడలేని వారిని నియమించడం వల్ల వారు చెప్పిందేమిటో అర్థం కాక పిల్లలు ఇబ్బందులు పడడమే కాకుండా, ఇంటికివచ్చేస్తామని మారాం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏకలవ్య పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంలో విద్యాబోధన అయినప్పటికీ, ఉన్న టీచర్లకు కనీసం తెలుగు మాట్లాడడమైనా వచ్చి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని తల్లిదండ్రులు వాపోతున్నారు. సంబంధిత సబ్జెక్ట్‌ను ఆంగ్లంలో బోధనకు పట్టున్నవారితోపాటు తెలుగు తెలిసే వారిని ఉపాధ్యాయులుగా నియమించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వెంకయ్యపాలెంలో విషజ్వరాలు

- సమాచారం అందినా స్పందించని వైద్యులు, సిబ్బంది
- జ్వరపీడితులను పరామర్శించిన సిపిఎం నేతలు



జ్వర పీడితులకు పరామర్శిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని చిలకలగెడ్డ పంచాయితీ వెంకయ్యపాలెం గ్రామంలో విషజ్వరాలు, వాంతులతో పలువురు బాధపడుతున్నారు .సమాచారం తెలుసుకుఉన్న స్థానిక సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు శనివారం జ్వరపీడిత గ్రామాల్లో పర్యటించి, బాధితులకు అందుతున్న వైద్యం, ఇతరత్రా పరిస్థితులపై ఆరా తీశారు. జ్వరపీడితులను పరామర్శించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి గంగరాజు, టోకూరు సర్పంచ్ కిల్లో మొస్య మాట్లాడుతూ, జ్వరాలు ప్రబలిన వెంకయ్యపాలెంలో వెంటనే వైద్యశిబిరం నిర్వహించాలని కోరారు. విషజ్వరాలతోపాటు వాంతులతో అనేకమంది బాధపడుతున్నందున వారి ఆరోగ్యం క్షీణించి, ప్రాణాల మీదకు రాకముందే అధికారులు స్పందించాలని కోరారు. కాగా వెంయ్యపాలెంలో సిపిఎం నేతలు సందర్శించే సమయానికి గెమ్మెల.అనిత, గెమ్మెల శామ్యూల్, గెమ్మెల మాధురి, గెమ్మెల ధారకొండ, సూకూరు సత్యారావు, గెమ్మెల సీతమ్మ, గుద్దెల గంగతల్లి, సోమేల.చినతల్లి ,గెమ్మెల.దీపికతోపాటు పలువురు జ్వరంతో బాధపడుతున్నారు. గ్రామాల్లో జ్వరాలు ప్రబలిన విషయమై స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సంతోష్, సిబ్బందికి సమాచారం అందినా స్పందించకపోవడంపై సిపిఎం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు స్పందించాలని కోరారు. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సిపిఎం నాయకులు టోకురు గిరిజన సంఘం నాయకులు నరాజీ సురేష్ బాబు, దీసరి.లక్ష్మణ, గ్రామాస్తులు దేముడు, భీమన్న, అప్పన్న పాల్గొన్నారు

పరుగుల వీరులకు అభినందన



మారథాన్ విజేతలను అభినందిస్తున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి- అరకులోయ : ఖేలో భారత్ యూత్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఉత్తప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో నేషనల్ ఛాంపియన్ షిప్ మారథాన్ పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించిన గిరిజన క్రీడా కారులకు పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్ అభిషేక్ అభినందించారు. పాడేరులోని ఐటిడిఎ కార్యాలయంలో పది కిలోమీటర్ల పరుగుపందెంలో స్వర్ణపతక విజేత ఆరకులోయ మండలం పెదలబుడు పంచాయతీ గరుడగూడ గ్రామానికి చెందిన కిల్లో బుద్ధు, ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో విజేతగా నిలిచిన అనంతగిరి మండలం కొత్తూరు పంచాయతీ తుమ్మనవలస గ్రామానికి చెందిన కొర్ర గోపిలను పిఒ అభిషేక్ అభినందించారు. పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లిన వీరిని ఐటిడిఎ తరపున పిఒ ఆర్థికసాయం అందించి ప్రోత్సాహించిన విషయం తెలిసిందే. మారథాన్ పోటీల్లో రాణించిన క్రీడాకారులకు అంతర్జాతీయ పోటీలకు సన్నద్ధమైతే, వారికి అవసరమైన ఆర్థికచేయూతను ఐటిడిఎ అందిస్తుందని పిఒ అభిషేక్ భరోసానిచ్చారు.


పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్‌లు



హుకుంపేట పాఠశాలలలో ఏర్పాటైన వినియోగదారుల క్లబ్

ప్రజాశక్తి -హుకుంపేట: వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహనకు ప్రభుత్వ ఉన్నత, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఎపి పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ ఉత్తర్వుల మేరకు వినియోగదారుని విద్యపై అవగాహనకు 8,9 తగతుల విద్యార్థులతో వినియోగదారుల క్లబ్బులు ఏర్పాటు చేసారు. హుకుంపేట మండలంలో ప్రధానోపాధ్యాయులు, క్లబ్ ఇన్‌ఛార్జిలు ఎల్.లోహితస్యుడు, పి. వెంకటరావు సిబ్బంది బాలకృష్ణ, శ్యాంసుందర్‌లను వినియోగదారుల క్లబ్‌కు ఎన్నిక చేశారు.అనంతరం జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు బూడిదే చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి రమేష్ కిముడు, జాయింట్ సెక్రటరీ ఒలిబిరి బాలరాజు, పాఠశాల వినియోగదారుల సంఘం అధ్యక్షులుగా పొట్నూరి సంధ్య, ఉబ్బేటి దీపక్, ప్రధాన కార్యదర్శులుగా జెమ్మెలి హరి, కొర్ర సంతోష్‌లను ఎంపిక చేశారు.

విద్యుదాఘాతంతో ఆటోడ్రైవర్ మృతి



మృతుడు టైసన్

ప్రజాశక్తి - చింతపల్లి : విద్యుత్ షాక్‌కు గురై గూడెం కొత్తవీధి మండలం వంచుల పంచాయతీ సిరిబల గ్రామంలో ఆటోడ్రైవర్ జోరంగి టైసన్ మృత్యువాత పడ్డాడు. అందిన సమాచారం మేరకు వివరాలవి. మృతుడు టైసన్ గ్రామంలో ఆటో నడుపుకుంటూ కుటుంబపోషణ సాగిస్తున్నాడు. శనివారం విద్యుత్ స్తంభం ఎక్కుతుండగా విద్యుత్తు వైర్ తగిలి షాక్‌కు గురై స్తంభం నుంచి కింద పడడంతో సహ కోల్పోయాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో అతనిని హుటాహుటీన ఆర్‌వినగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ టైసన్ తుది శ్వాస విడిచాడు. టైసన్ మృతితో కుటుంబ సభ్యులు బోరున విలపించారు

అందరికీ అభివృద్ధి, సంక్షేమం..

సంపూర్ణత అభియాన్ లక్ష్యం

- అల్లూరి జిల్లాను ఎంపిక చేసిన నీతిఆయోగ్
- దేశంలో 112 జిల్లాల్లో అల్లూరి ఒకటి
- జిల్లాలో వై.రామవరం, గంగవరం, మారేడుమిల్లి మండలాలకు స్థానం
- జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి- పాడేరు,: అభివృద్ధి సంక్షేమ ఫలాలు చిట్టచివరి స్థాయి వరకు అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం సంపూర్ణత అభియాన్ పథకం ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో సంపూర్ణత అభియాన్ పథకాన్ని ప్రారంభించి, సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నీతి అయోగ్ దేశంలో ఎంపిక చేసిన 112 జిల్లాల్లో అల్లూరి జిల్లా ఉందన్నారు. రాష్ట్రంలో అల్లూరితోపాటు పార్వతీపురం, కడప జిల్లాలను మాత్రమే ఈ పథకానికి ఎంపిక చేయగా, దేశంలో 500 మండలాలు/బ్లాకులు ఎంపిక కాగా, వాటిల్లో రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో 15 మండలాలు ఉండగా, అల్లూరి జిల్లాలో వై. రామవరం, గంగవరం, మారేడుమిల్లి మండలాలను ఎంపిక చేసిందన్నారుఈ పథకం కింద ముఖ్యంగా ఆరోగ్యం, పౌష్టికాహారం, వ్యవసాయ అనుబంధ శాఖలు, విద్య, మౌలిక సదుపాయాలు మొదలగు సూచికలలో ప్రగతి గుర్తించి ర్యాంకులు కేటాయిస్తారని వివరించారు.

ఆయా శాఖల అధికారులు నిర్దేశిత ప్రజల వరకు ఫలాలు తీసుకువెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఇండికేటర్స్‌లో ప్రగతి మేరకు నీతిఅయోగ్ నుండి నిధులు నేరుగా మంజూరు చేస్తారన్నారు. గ్రామ సచివాలయాల సిబ్బంది ఈ కార్యక్రమంలో పూర్తి భాగస్వామ్యం కావాలని ఆదేశించారు. ఆరోగ్య క్రమశిక్షణలో భాగంగా యుక్తవయసు మహిళలను నిర్ణీత వయసు నిండాక మాత్రమే వివాహం చేసుకొనేలా చూడాలని, గర్భం దాల్చడానికి ఆరోగ్యపరంగా అనుకూలంగా ఉండేలా చూడాలని, గర్భం దాల్చిన నాటి నుండి బిడ్డ పుట్టి ఏడాది వరకు వారి ఆరోగ్య స్థితిగతులు ట్రాక్ చేసే విధంగా జిల్లా వైద్య ఆరోగ్యాధికారి, ఐసిడిఎస్ పిడి బాధ్యత వహించి, వారికి అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు. వారికి ప్రభుత్వపరంగా అందిస్తున్న ౨ బాల సంజీవిని కిట్స్, పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకుంటున్నదీ లేనిదీ పర్యవేక్షించాలన్నారు. అలాగే స్థానికంగా లభ్యమయ్యే పోషక విలువలున్న ఆకు కూరలు, ములగాకు, దుంపలు లాంటివి తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఆసుపత్రుల ప్రసవాలను ప్రోత్సహించాలని, ప్రసవం తరువాత బిడ్డలకు నిర్ణీత సమయం ప్రకారం ఇమ్యునైజేషన్ అందించాలని సూచించారు. పిల్లలను పాఠశాల కంటే ముందు అంగన్వాడిలకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బడి బయట పిల్లలు లేకుండా చేసి, అందరికీ విద్యను అందించేలా చూడాలని ఆదేశించారు. ఆడ పిల్లలను భారంగా చూడటం, బాల్య వివాహాలు చేయడం వంటి వాటిని పారదోలే చర్యలు చేపట్టడం ద్వారా మాతాశిశు మరణాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూ పరీక్షలు నిర్వహించి గుర్తింపుకార్డులను జారీ చేయాలని సూచించారు.

అరకు ఎంపీ డాక్టర్ జి. తనూజరాణి మాట్లాడుతూ, నీతి అయోగ్ సంపూర్ణత అభియాన్ పథాకానికి అల్లూరి జిల్లా ఎంపిక కావడంపై హర్షం వ్యక్తంచేస్తూ దీన్ని విజయవంతం చేయాలని కోరారు. నీతి అయోగ్ ప్రతినిధి సాయితేజ మాట్లాడుతూ గత ఆగస్ట్ నెలలో నీతి అయోగ్ ర్యాంకులలో ఓవరాల్‌గా మొదటి స్థానం సాధించిన విషయాన్ని గుర్తుచేస్తూ నీతి ఆయోగ్ నిర్దేశించిన ఆరు ఇందికేటర్లను అమలు చేసి ర్యాంకులు సాధించాలని కోరారు. మంచి ర్యాంకు సాధిస్తే మరిన్ని పథకాలు వస్తాయన్నారు. ఐసిడిఎస్ పిడి ఎన్, సూర్యలక్ష్మి, డిఎంహెచ్ఒ డాక్టర్ జమాల్‌భాషా, జిల్లా వ్యవసాయాదికారి బిఎస్.నంద్ ఆయా శాఖలు నీతి అయోగ్ కింద అమలు చేస్తున్న అంశాలపై వివరించారు. జిల్లా ముఖ్య ప్రణాలికాదికారి ఎస్‌ఎస్‌ఆర్ కె పట్నాయక్ మాట్లాడుతూ నీతి అయోగ్ గూర్చి, ప్రస్తుతం ప్రారంభమైన సంపూర్ణత అభియాన్ గురించి వివరించారు.

ముందుగా కలెక్టరేట్ ఆవరణలో వ్యవసాయ శాఖ, ఐసిడిఎస్ ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎంపీతోపాటు కలెక్టర్ పరిశీలించారు. ఆయా స్టాళ్ళలో బాలసంజీవని కిట్లలో వస్తువులు, విత్తనాలు, మిల్లెట్లు, కూరగాయలు, చేక్కీలు, పరిశీలించారు. చిన్నారులకు బాలామృతం తినిపించి బాలింతలను ఆశీర్వదించారు. గర్భిణులకు సీమంతం చేసి పౌష్టికాహార కిట్లను పంపిణీ చేసారు. అనంతరం సంపూర్ణత అభియాన్ పోస్టర్లను ఆవిష్కరించి, ప్రతిజ్ఞా పత్రంపై సంతకం చేసారు. కార్యక్రమంలో జిల్లా గణాంకాధికారి వెంకట రావు, డిఆర్‌ఒ బి పద్మావతి, జెడ్పిఎన్‌ఎఫ్ డిపిఎం భాస్కరరావు, పలువురు, జెడ్పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంతం సంపూర్ణ అభివృద్ధే లక్ష్యం

రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్



కార్యక్రమంలో పాల్గొన్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ తదితరులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఏజెన్సీ ప్రాంతంల సంపూర్ణ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం సంపూర్ణత అభియాన్ కార్యక్రమం చేపట్టినట్లు రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ అన్నారు. నీతి అయోగ్ పథకంలో భాగంగా ఎంపికైన మారేడుమిల్లిలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. పాత ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీపీ సార్ల లలిత కుమారి, ఎంపీడీవో ఏ వీర కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యం, విద్య, వైద్యం, వ్యవసాయం, స్వయం సహాయ సంఘాల అభివృద్ధి, మహిళల శిశు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. దీని కోసం అధికారులు కృషి చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలోని అంగన్వాడీ, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు తదితరులను సమన్వయం చేస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. మహిళా స్వయం సహాయక సంఘాలు మహిళ శక్తి పథకం ద్వారా అధికంగా అభివృద్ధి చెందాలన్నారు. సెప్టెంబర్ 30 తేదీ వరకు క్షేత్రస్థాయిలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టార్స్‌ను పరిశీలించారు. సంపూర్ణ అభియాన్ అవగాహన ర్యాలీలో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ కొండ రవికుమార్, సర్పంచ్ కొండా జాకబ్, ఉప సర్పంచ్ బొడ్డేటి వీరబాబు, అన్ని శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఫీడర్ అంబులెన్స్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-చింతూరు

ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న ఫీడర్ అంబులెన్స్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం జరిగిన ఫీడర్ అంబులెన్స్ కార్మికుల సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ ఫీడర్ అంబులెన్స్ కార్మికుల సమస్యలను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వమైన వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్మికులను ఆప్కాస్‌లో కలపాలన్నారు. ఏజెన్సీ మారుమూల ప్రాంతాలకు వెళ్లి రోగులను ఆసుపత్రులకు తీసుకొస్తున్న వీరికి వెహికల్ మెయింటినెన్స్ కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫీడర్ అంబులెన్స్ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పొడియం లక్ష్మణ్, కార్మికులు వెంకటేశ్వర్లు, అర్జున్, రవి, మహేందర్, కృష్ణ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్




రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

రైతులకు మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న మొక్కలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి రైతులకు పంపిణీ చేశారు. సుమారు 200 మంది గిరిజన రైతులకు జీడి మామిడి, రబ్బరు, పామాయిల్, కొబ్బరి మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన రైతులు ఈ మొక్కలను సాగు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. అనంతరం స్థానికులు పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే తన వద్దకు వచ్చిన సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జడ్పిటిసి ఒడుగుల జ్యోతి, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు గొల్లపూడి పెద్దిరాజు, ముప్పన డింబకేశ్వరరావు, మాజీ సొసైటీ అధ్యక్షులు గణజాల తాతారావు, ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వర రావు,ఉపాధి హామీ ఏపీవో సురేష్ కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు

వరద సహాయక చర్యలపై గ్రామసభ

ప్రజాశక్తి- విఆర్.పురం

ముందస్తుగా వరద సహాయక చర్యల కోసం మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో శనివారం అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు సయ్యద్ మౌలానా ఫాజిల్, ఎంపిడిఓ ఆర్.ఫణీంద్ర రెడ్డి మాట్లాడుతూ వరదలు వచ్చినప్పుడు భయపడాల్సిన అవసరం లేదని, అన్ని వసతులు కల్పిస్తామని చెప్పారు. వరదలపై గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. స్థానిక సర్పంచ్ పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ వరదల కారణంగా ప్రజలు నరకం చూస్తున్నారన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ ఇవ్వాలని, కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా ముంపునకు గురవుతున్న వారందరికీ పునరావాసం కల్పించాలని, గ్రామాలు ఖాళీ చేసేనాటికి 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులకు ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరదల సమయంలో గుట్టలపై గుడిసెలు వేసుకునే వారికి సోలార్ లైట్లు బిగించాలని, నాటు పడవ ఏర్పాటు చేయాలని, ప్రజలు జ్వరాల బారిన పడకుండా వైద్య సేవలు అందించాలని కోరారు. ముందస్తుగానే కిరోసిన్, దోమతెరలు, టార్పాలిన్లు, సోలార్ లైట్లు, మూడు నెలల రేషన్ సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, ఉప సర్పంచ్ దుర్గారావు, సిపిఎం నాయకులు పులి ధర్మరాజు, జి లక్ష్మణరావు, కాంతారావు, ధారయ్య, నల్లారప్ప, చందర్రావు, ఆర్ఐ యం రామకృష్ణ, విఆర్ఒలు, విఆర్ఎలు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



అడుగడుగునా పెద్ద గోతులు ఉన్న రహదారి

అడుగడుగునా గోతులు

- అవస్థలు పడుతున్న వాహనచోదకులు

ప్రజాశక్తి-విఆర్.పురం

విఆర్.పురం బ్రిడ్జి వద్ద నుండి సున్నంవారి గూడెం వెళ్లే బిటి రోడ్డులో అడుగడుగునా గోతులు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోతుల వల్ల వాహనాలు తరచూ పాడైపోతుండడంతో తమ ఆదాయమంతా వాహనాల రిపేర్లకే వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విఆర్.పురం బ్రిడ్జి నుండి రేకపల్లి వరకు ఐదు కిలోమీటర్లు, అక్కడ నుండి సున్నంవారి గూడెంకు పది కిలోమీటర్లు మొత్తం 15 కిలోమీటర్లు రోడ్డు మొత్తం పెద్ద పెద్ద గోతులతో ఉంది. సైకిల్ మీద కూడా ప్రయాణించలేని విధంగా ఉంది. వర్షం పడితే గోతుల్లో నీరు చేరడంతో ఏది పెద్ద గొయ్యో, ఏది చిన్న గొయ్యో తెలియక చాలా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఐదు సంవత్సరాల నుండి తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టలేదు. నూతన ప్రభుత్వమైనా రహదారులను పట్టించుకోవాలని, ఆర్ అండ్ బి ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే ఈ రోడ్డును మరమ్మతులు చేయించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

10న డిమాండ్స్ డేను జయప్రదం చేయండి

సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి -సీలేరు

ఈనెల 10న దేశవ్యాప్త కార్మికుల డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. జీకే వీధి మండల కేంద్రంలో శనివారం జరిగిన సిఐటియు మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారాన్ని చేపట్టిన మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మిక వర్గ హక్కులను కాలరాసే లేబర్ కోడ్ అమలుకు పూనుకుంటుందని తెలిపారు. కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధంగా ప్రావిడెంట్ ఫండ్ చట్టంలో పెనాల్టీని తగ్గించి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాల మూలంగా రైల్వే రంగంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, విమానాశ్రయాలకు భద్రత లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 10న జరుగుతున్న డిమాండ్స్ డేని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు అప్పలనరస, జి.సత్యనారాయణ, అంగన్వాడీ యూనియన్ మండలాధ్యక్షురాలు యల్.సత్యవతి, జి.దయ వెంకటి, రామజ్యోతి, మీనాక్షి, సావిత్రి, మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు కె.కుమారి కె.లక్ష్మి, చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సిఐటియు నేత చిన్నయ్యపడాల్, వివిధ రంగాల నేతలు


చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: పరిసరాల పరిశుభ్రతతోనే అనేక వ్యాధులు దరిచేరకుండా చేయవచ్చని గసభ పంచాయతీ సర్పంచ్ పి సునీత అన్నారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు.. గసభ గ్రామ పంచాయతీ కేంద్రంలో ప్రజలకు చెత్త బుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో పంచాయతీ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. వర్షాలు పడుతుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా అధికారులు కృషి చేయాలని కోరారు. గ్రామపంచాయతీలకు ఇచ్చిన నిధులతో మంచినీరు, వీధి దీపాలు, పారిశుధ్యం కోసం వెచ్చించామన్నారు. గ్రామసభకు ప్రత్యేక అధికారిగా వచ్చిన ఉపాధి ఎపిఒ రామేశ్వర్‌రావు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా మట్టి రోడ్లకు ప్రాధాన్యత ఇవ్వాలనికోరారు. ఇప్పటివరకు ఉపాధిపనులు చేసేవారి కూలీలకు వారి ఖాతాల్లో త్వరలో బిల్లులు జమచేస్తామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా సిల్వర్‌ఓక్, పండ్ల మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. గ్రామసభలో ఎంపిటిసి వంతాల జెమ్మ, గసభ మాజీ సర్పంచ్ పాంగి. సురేష్ కుమార్, సెక్రటరీ డొంబుర్ దార్, వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధి సిబ్బంది, అంగన్వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌లు నిర్మించి సాగునీరు అందించండి

ప్రజాశక్తి- పెదబయలు : చెక్ డ్యామ్‌లు నిర్మించి, పంట పొలాలకు సాగునీరు అందించాలని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ, గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు జె,సునీల్,కుమార్ గోమంగి ఉపసర్పంచ్ మత్యకొండ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గోమంగి పంచాయతీ గోమంగి ఊబలగరువు, సరిసపల్లి కాలనీ, కుమ్మరి వీధి, గుల్లెలు దెండ డ్డరాయిపుట్టు, సంత వీధి తదితర గ్రామాలను పర్యటించారు.ఈ సందర్భంగా అందుబాటులో సాగునీరు ఉన్నప్పటికీ అవిపొలాలకు మళ్లే వీలు లేక ఏడు గ్రామాలకు చెందిన 150ఎకరాలు సాగులేయలేని స్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సాగునీటి కష్టాలను దృష్టిలో పెట్టుకుని చెక్‌డ్యామ్‌లను నియమించాలని కోరారు.కార్యక్రమంలో మహేష్, బొంజబాబు, దామోదరం, కిషోర్ పాల్గొన్నారు.

'ఎల్‌విపి'లో ఇన్ఫోర్ మయోపియా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్ ఎన్‌ఫోర్ సహకారంతో హనుమంతవాక జంక్షన్‌లోని ఎల్‌వి.ప్రసాద్ వైద్య విజ్ఞాన సంస్థ జిఎంఆర్ వరలక్ష్మి క్యాంప్‌లో మయోపియా కేంద్రాన్ని శనివారం ముఖ్య అతిథులు గీతం యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ రాజా, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ప్రొఫెసర్ పి.పుష్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా జిఎంఆర్‌వి క్యాంపస్ అధినేత డాక్టర్ వీరంద్ర సచ్‌దేవా మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఎల్‌విపిఇఐ క్యాంపస్‌లో మొట్టమొదటి సారిగా ఈ సదుపాయాన్ని ఏర్పాటుచేయగా, తరువాత ఎన్ఫోర్ భాగస్వామ్యంతో విశాఖలో మూడవ కేంద్రంగా ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. దగ్గరగా ఉన్న వస్తువులు సరిగ్గా కనిపించక పోవడం వంటి మయోపియా సమస్యలతో బాధపడుతున్న చిన్నారులు, యువకులకు ఈ కేంద్రం ఎక్కువగా ఉపయోగపడుతుందన్నారు. ఇన్ఫోర్ సెంటర్ నెట్ వర్క్ హెడ్ డాక్టర్ పవన్ వర్కిచర్ల మాట్లాడుతూ, వ్యాధి నియంత్రణ కోసం సంపూర్ణ చికిత్సను అందించడానికి అత్యాధునిక సాంకేతికతను ఈ కేంద్రం కలిగి ఉందన్నారు. నగర వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సినేషన్

పశు సంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ నరసింహులు


అనంతగిరిలో పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని పశు సంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నరసింహులు అన్నారు. శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా డుంబ్రిగుడ వెటర్నరీ కార్యాలయంలో కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలను వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజశ్రీ, సిబ్బంది సుబ్బారావు, త్రినాధ రావు, సంజీవ్, అనంతరావు, రత్నం, మనోజ్ కుమార్, జానకి పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని హుకుంపేట, బాకూరు పశు వైద్యశాలల్లో శనివారం జునోసిస్‌డే సందర్భంగా 137 పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు వేశామని పశువైద్యాధికారి చరణ్ తెలిపారు. బాకూరు పశు వైద్య శాలలో రాబిస్ వ్యాక్సినేషన్‌లో పాల్గొన్న వైస్ ఎంపిపి సుడిపల్లి కొండలరావు మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు అనేక వ్యాధులు సంక్రమిస్తామని, అలాగే కుక్కల ద్వారా రేబిస్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉన్నందున ఏటా జునోసిస్ డే సందర్భంగా ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే వ్యాక్సిన్‌ను పెంపుడుకుక్కలకు యజమానులు వేయించాలన్నారు.కార్యక్రమంలో దూసూరు వెంకటరావు, వెటర్నరీ అసిస్టెంట్‌లు సన్యాసిరాజు, దొన్ను శేఖర్, సునీల్, పాడి బాలన్న, పద్మకుమారి, బుజ్జిబాబు, సోమా, సౌదామిని, హుకుంపేట మండల వెటర్నరీ అసిస్టెంట్ ప్రశాంత్, సచివాలయ పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెదబయలు : ప్రపంచ జూనోసిన్ దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలో 28 పెంపుడు కుక్కలకు డాక్టర్ సౌజన్య ఆధ్వర్యంలో యాంటీ రాబిస్ వ్యాక్సినేషన్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎల్, రాజా రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు

అనంతగిరి : మండలంలోని కాశీపట్నం, అనంతగిరి పశువైద్యశాలల్లో డాక్టర్ సాగరి గణేష్, బి.సందీప్ ఆధ్వర్యంలో 224 పెంపుడు కుక్కలకు యాంటీ రాబిస్ టీకాలు వేశారు.ఈ సందర్భంగా కుక్కలు, ఇతర జంతువులు పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రాణాంతక ర్యాబిస్ వ్యాధి కుక్కలకు వాటి ద్వారా మనుష్యులకు సోకకుండా ఉండాలంటే ముందస్తు వ్యాక్సినేషన్ ఒక్కటే మార్గమన్నారు.

సీలేరు: జూనసిస్ దినోత్సవం కార్యక్రమంలో జీకే వీధి మండల పరిధిలో ఉన్న పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ శనివారం వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ మండల పరిధిలో 137 పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేసినట్లు చెప్పారు. పెంపుడు కుక్కలకి టీకాలు వేయడం వల్ల ఎటువంటి సమస్యలు తలెత్తవని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకుడు ఖాదర్, వెటర్నరీ అసిస్టెంట్ అనుష్క, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గీతం డిగ్రీ, పీజీ సైన్స్ కోర్సుల అడ్మిషన్లు

14న ప్రవేశ పరీక్ష


అడ్మిషన్ల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశానికి ఈ నెల 14వ తేదీన గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్) నిర్వహించనున్నట్లు స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కృష్ణ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వేదవతి తెలిపారు. శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ప్రవేశ పరీక్షకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ విత్ కాగ్నిటివ్ సిస్టమ్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో 4 సంవత్సరాల బిఎస్సీ (ఆనర్స్) కోర్సులు, 3 సంవత్సరాల బిసిఎ కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. అప్లైడ్ మేథ్స్, బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, డేటా సైన్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో 2 సంవత్సరాల ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వీటితో పాటు మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసిఎ) కోర్సు ఉందని తెలిపారు.

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా బిఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామని, ఈ కోర్సులలో ప్రవేశానికి ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. వివరాల కోసం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. గ్యాట్ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోదలచిన వారు గీతం వెబ్ సైట్‌ను పరిశీలించవచ్చన్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ప్రభుత్వ ఉమ్మడి ప్రవేశ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన వారు, క్యాట్, జెఇఇ వంటి జాతీయ స్థాయి పరీక్షలలో ఉత్తీర్ణత పొందిన వారు తమ ర్యాంక్ కార్డులతో నేరుగా ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ప్రతిభ గల విద్యార్థులకు గీతం స్కాలర్‌షిప్‌లను అందిస్తుందని చెప్పారు.

నూతన విద్యా విధానంలో భాగంగా నిర్వహిస్తున్న 4 సంవత్సరాల బిఎస్సీ డిగ్రీ కోర్సు పూర్తి చేసిన వారు నేరుగా పిహెచ్‌డి కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని డీన్ ప్రొఫెసర్ కృష్ణ తెలిపారు. డిగ్రీ కోర్సు నుంచి నేరుగా పరిశోధక విద్యార్థిగా మారే క్రమంలో విద్యార్థులకు అత్యున్నత ప్రయోగశాలలో పనిచేసే అనుభవం ఉపయోగడుతుందన్నారు. ఈ కారణంగా గీతంలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ప్రత్యేక ప్రయోగశాలలు నెలకొల్పామని చెప్పారు. సెంట్రల్ రీసెర్చ్ ల్యాబ్స్, మూర్తి ల్యాబ్స్ విద్యార్థులకు అంతర్జాతీయ పరిశోధనశాలలపై అవగాహన పెంచుకునేందుకు ఉపయోగపడతాయన్నారు.

నేరాలు ఘోరాలు

పరారీలో ఉన్న గంజాయి నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి -గొలుగొండ: 2017లో 106 కిలోల గంజాయి రవాణాలో నిందితుడిగా ఉండి, పరారిలో ఉన్న అల్లూరి జిల్లా గూడెంకొత్తవీధి మండలం మొండిగెడ్డ గ్రామానికి చెందిన జడ్డు నాగరాజును శనివారం పట్టుకున్నట్లు కేడీపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. ముద్దాయిని కోర్టు ఆదేశాల మేరకు విశాఖపట్నం సెంటర్ జైలుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో గంజాయి రవాణా, అసాంఘిక కార్యక్రమాల సమాచారం తెలిస్తే పోలీసులకు 9440904240 ఫోన్ నెంబర్‌కు సమాచారమిచ్చి సహకరించాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

పుట్టుకతో వచ్చే లోపాలపై శిక్షణ

ప్రజాశక్తి-సీతమ్మధార : పుట్టుకతో వచ్చే లోపాలపై అన్ని ఆసుపత్రుల స్పెషలిస్ట్ డాక్టర్లు, మెడికల్ ఆఫీసర్లు, సిహెచ్‌ఒలు, స్టాఫ్ నర్సులు, సూపర్వైజర్లకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో వారం రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఈ శిక్షణలో పిల్లలలో పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించుట, తలనుంచి పాదాలవరకు చేసే పరీక్ష విధానం, అప్పుడే పుట్టిన నవజాత శిశువు వయసు నుంచి అంగన్వాడీ విద్యార్థుల వరకు పరీక్షలు నిర్వహించి పోషకాహార పెరుగుదల లోపాలు, జన్యు పరమైన లోపాలు, వైకల్యం, బరువు తక్కువ పిల్లలు, నెలలు నిండక ముందే పుట్టిన పిల్లలు, మెల్ల కన్ను, పెదవి, అంగటి చీలిక, కంటి శుక్లాలు, వినికిడి లోపాలు, గుండె సంబంధిత వ్యాధులు తదితరాలను గుర్తించి సత్వర చికిత్స అందించుట లక్ష్యంగా శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్‌వి.సమత, డాక్టర్ బి.సంధ్యా రాణి, డాక్టర్ సాయి కిరణ్, శాంతి ప్రియ తదితరులు పాల్గొన్నారు.



భారత రాజ్యాంగ పీఠిక పుస్తకావిష్కరణలో మాట్లాడుతున్న శ్రీధర్

రాజ్యాంగ పీఠికను మననం చేసుకోవాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : భారత రాజ్యాంగ పీఠిక అంటే ఏమిటో ప్రతి ఒక్కరూ చదివి మననం చేసుకోవాలని పూర్వ కేంద్ర సమాచార కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ సూచించారు. పౌర ప్రజాసంఘాల వేదిక ఆధ్వర్యంలో పౌర గ్రంథాలయంలో సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన శనివారం శ్రీధర్ రాసిన "భారత రాజ్యాంగ పీఠిక" పుస్తకాన్ని లీడర్ పత్రిక సంపాదకుడు వివి రమణమూర్తి ఆవిష్కరించారు. నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు వి.అంజిరెడ్డి పుస్తకాన్ని సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీధర్ మాట్లాడుతూ, మనం రూపొందించుకుని ఆమోదించుకున్న రాజ్యాంగం అమలులోకి వచ్చి 77 ఏళ్ల గడిచినా హక్కుల గురించి ఎవరు మాట్లాడినా దేశద్రోహులు అని పాలకులు అనడం పరిపాటిగా మారిందన్నారు. స్వతంత్ర, ఘనతంత్ర దినోత్సవం నాడు మాత్రమే గుర్తు చేసుకొని తరువాత పక్కన పెడుతున్నారని చెప్పారు. ప్రజలు భావాలను స్వేచ్ఛగా మాట్లాడడానికి కూడా అర్హత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట సభలకు ఎన్నికైన ప్రజా ప్రతినిధులు రాజ్యాంగం మీద ప్రమాణం చేసి రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో ప్రజలందరికీ సరళమైన భాషలో అర్థం అయ్యేటట్లు రాశానని, మన హక్కులు కాపాడుకోవడానికి పుస్తకం ఉపయుక్తమైతే మంచిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సాహితీ వేత్తలు, ప్రజలు పాల్గొన్నారు.


ఇఇ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సుభాన్ తదితరులు

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ఏపీ జెన్కో కాలనీలో డస్ట్ బిన్లలో వ్యర్థాలను తొలగించే కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు గౌరవ అధ్యక్షులు ఎస్కే.సుభాన్, అధ్యక్ష కార్యదర్శులు బి.లక్ష్మణ్ విష్ణుకుమార్ శనివారం ఎపి జెన్కో ఈఈ ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. కాలనీలో కుక్కలు, ఆవులు, ఏ జీవులు చనిపోయినా వాటిని, చెత్త చెదరాలతో పాటు పడవేసే బాధ్యత వారిపైనే పెట్టారని, కాని వారికి నెలలో వారు రోజులే పని దినాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. 2024-25 సంవత్సరంలో కాంట్రాక్టు దక్కించుకున్న గుత్తేదారుడు కె.రవికుమార్ ఒక్కో కార్మికుడికి రోజుకు రూ.350 మాత్రమే కూలి ఇస్తున్నారని తెలిపారు. కనీసం రోజుకి రూ.500 చొప్పున కూలి ఇవ్వాలని, నెలలో 15 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. ప్రస్తుతం నిత్యవసర సరుకులు ధరలు మండిపోతున్న కార్మికుల కుటుంబాల పోషణ కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ డిమాండ్లను పరిశీలించాలని కోరారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సమస్యలను పరిష్కంచాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ రాజకుమార్ రెడ్డి పల్లాల డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం నాయకులు శనివారం కళాశాలను సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ విద్యార్థులు సుమారు 150 మంది ఉన్నారని, వారికి హాస్టల్ వసతి, నీటి కొరత ఉందని పేర్కొన్నారు. కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు హాస్టల్ సదుపాయం లేక వారు చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మారేడుమిల్లి యూత్ శిక్షణ కేంద్రంలో విద్యార్థులకు కళాశాల, వసతి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు మల్లా దుర్గ ప్రసాద్, టిడిపి మండల మాజీ అధ్యక్షులు బిశెట్టి అప్పాజీ, చావడికోట సర్పంచ్ సాధల ప్రేమ్ కుమార్ రెడ్డి, అందాల సూర్యనారాయణ రెడ్డి సారపు రాజన్న దొర, లోత లక్ష్మీనారాయణ రెడ్డి, కత్తుల రమణారెడ్డి, పల్లాల భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం మోటారు బోర్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ నరమామిడి గొంది గ్రామంలో తాగునీటి సమస్యపై స్థానిక మహిళలు శుక్రవారం నిరసన తెలిపిన నేపథ్యంలో దారకొండ పంచాయతీ కార్యదర్శి వాసం శ్రీనివాస్, ఎంపీటీసీ మాడి రామన్న, సర్పంచి ఎన్.రాజు స్పందించారు. గ్రామంలో కాలిపోయిన మోటారు బోర్టుకు శనివారం మరమ్మతులు చేపట్టారు. రెండు సంవత్సరాలుగా మోటారు బోర్డు కాలిపోయినా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు మరమ్మతులు చేపట్టలేదు. ఈ రెండేళ్లగా కొద్దోగొప్పో తాగునీరు అందిస్తున్న సత్యసాయి ట్రస్ట్ గ్రావిటీ పథకం పైపులైన్‌లో చెత్తాచెదారుల పేరుకుపోవడంతో పూర్తిస్థాయిలో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో మహిళలు శుక్రవారం కుళాయిల వద్ద నిరసన తెలిపిన నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మోటారు బోర్టుకు మరమ్మతులు చేపట్టి మంచినీటి సౌకర్యం కల్పించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

విక్టోరియా ఆసుపత్రిని ఆధునికీకరిస్తాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాత నగరంలోని గవర్నమెంట్ విక్టోరియా హాస్పిటల్ (ఘోసాసుపత్రి)ని ఆధునికీకరించి, అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన విక్టోరియా హాస్పిటల్‌లో పర్యటించారు. సూపరింటెండెంట్, సిబ్బందిని కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి సంబంధించిన అభివృద్ధి పనులు, చేపట్టవలసిన పనులు గురించి అడిగారు. ఆసుపత్రిలో వైద్య సేవలు పట్ల గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఉష పాల్గొన్నారు.

12 పాఠశాలల్లో ఒక్కో టీచరే..!

విలీన ప్రక్రియతో సర్కారు బడికి ఇబ్బందులు
భర్తీకాని ఉపాధ్యాయ పోస్టులు
మూడేళ్లుగా తగ్గుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - భీమునిపట్నం

సమాజంలో నైతిక, ప్రజాస్వామిక విలువలు ధృడంగా నిలబడాలన్నా, మానవత్వం పరిమళించాలన్నా, చదువుకున్న చదువును సమాజం కోసం నిస్వార్థంగా వినియోగించాలన్నా ప్రభుత్వ బడి ఉండాలి. అయితే కొద్దికాలంగా పాలకులు అవలంబిస్తున్న విధానాలు ఎంతో మంది పిల్లలను సర్కారు బడికి దూరం చేశాయనే చెప్పొచ్చు. గత ప్రభుత్వం తీసుకున్న విలీన ప్రక్రియ నిర్ణయంతో బడిని కష్టాలు చుట్టుముట్టాయి. మండలంలోని 12 ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో టీచర్‌నే విద్యాబోధన చేస్తున్న విషయం విస్మయం గొలుపుతోంది.

భీమిలి మండలం, జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో 67 ప్రాథమిక, 11 ప్రాథమికోన్నత, 22 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. గత ప్రభుత్వం తీసుకొచ్చిన విలీన ప్రక్రియ, ఏళ్ల తరబడి భర్తీకి నోచుకోని ఉపాధ్యాయ నియామకాలు, ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతలు అప్పగింత, 117 జిఒ వెరసి ప్రభుత్వ బడికి పేద పిల్లలను దూరం చేశాయనే చెప్పొచ్చు. మండలం, జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో ఉన్న వంద ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు 2021-22లో 10,456 మంది విద్యార్థులు ఉండగా 2022-23లో 10,431కి ఆ సంఖ్య చేరింది. 2023-24లో 9,682కి పడిపోయింది.

మండలం, జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో ఉన్న 12 ప్రాథమిక పాఠశాలల్లో ఐదు తరగతులకు ఒకే టీచర్ పాఠాలు చెబుతున్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన విలీన ప్రక్రియ ద్వారా అనేక రకాల సమస్యలు ఉత్పన్నమయ్యాయని చెప్పవచ్చు. ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను 3 కిలోమీటర్ల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో నాడు విలీనం చేశారు. దీని వల్ల ఒక్కో పాఠశాలలో 20 మందిలోపు పిల్లలున్నారు. చిప్పాడ, దాకమర్రి పంచాయతీ దాసరిపేట, సింగనబంద పంచాయతీ కరగానిపేట, పాత మూలకుద్దు, టి.నగరపాలెం, తాటితూరు కల్లాలు, అన్నవరం పంచాయతీ పైలపేట, జివిఎంసి రెండో వార్డు బ్యాంకు కాలనీ, డెక్కతిపాలెం, నాలుగో వార్డు ఆర్‌జె.అగ్రహారం, మంగమారిపేట, కల్లివానిపాలెం ప్రాథమిక పాఠశాలలు ఒకే టీచర్‌తో నడుస్తున్నాయి. ఫలితంగా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ఈ క్రమంలో పిల్లల ప్రవేశాలు తగ్గుతున్నాయి.



తాటితూరు కళ్లాల్లో ఒకే ఉపాధ్యాయునితో నడుస్తున్న పాఠశాల

చాలీచాలని ఉపాధ్యాయులు

1, 2 తరగతులకు తెలుగు, గణితం, ఇతర పాఠ్యాంశాలు, 3, 4, 5 తరగతులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం, పరిసరాల విజ్ఞానం, ఉన్నత పాఠశాలలో అయితే తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, పిఎస్, ఎన్ఎస్, సోషల్ పాఠ్యాంశాలు బోధించాలి. వాస్తవంగా ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు, యుపి పాఠశాలకు నలుగురుతో పాటు పిఇటి, ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంతో పాటు తొమ్మిది మంది ఉపాధ్యాయులు ఉండాలి. ఈ విధమైన నియామకాలు దాదాపు ఏ పాఠశాలలోనూ లేవనే చెప్పాలి.

గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 117 ప్రకారం.. 20 మంది విద్యార్థులకు ఒకే టీచర్ ఉండేలా ఉన్న నిబంధన ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసిందనే చెప్పాలి. ఆ జిఒ రద్దయితే మండలంలో 51 టీచర్ పోస్టులను పునరుద్ధరించే వీలుంది. ప్రస్తుతం మండలం, జివిఎంసి ఒకటో జోన్‌లో 100 పాఠశాలల్లో 454 టీచర్ పోస్టులకుగాను 403 మంది టీచర్లు ఉన్నారు. 51 టీచర్ పోస్టులు భర్తీ కాకుండా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం సర్కారు బడుల అభివృద్ధికి ఎటువంటి నిర్ణయం తీసుకోనుందో వేచిచూడాలి.

మత్తు కోరల నుంచి చిన్నారులను రక్షించాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మత్తు కోరల్లో చిక్కుకోకుండా చిన్నారులను రక్షించాలని, వారికి బంగారు భవిష్యత్తు అందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు పేర్కొన్నారు. పిల్లల్లో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నివారణ అనే అంశంపై ఎంవిపి.కాలనీ పరిధిలోని డిఆర్‌డిఎ ప్రగతి భవన్‌లో వివిధ జిల్లా స్థాయి అధికారులతో శనివారం ఉదయం కమిషన్ సభ్యులతో కలిసి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వంటి విషయాల్లో చిన్నారులు భాగస్వామ్యం కాకుండా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని సూచించారు. ఇటీవల ఢిల్లీ, తెలంగాణ రాష్ట్రాల్లో జరిగిన జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమావేశాల సారాంశాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు. చిన్నారుల జీవితాల్లోకి మత్తు మహమ్మారి చొరబడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ముఖ్యంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగానికి పిల్లలు దూరంగా ఉండేలా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అహర్నిశలూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వసతి గృహాలు, విద్యా సంస్థల్లో విద్యార్థులు చాలా మంది ప్రమాదకరరీతిలో ఉన్నారని, వారి భవితవ్యం గురించి ఆలోచిస్తుంటే ఆందోళనగా ఉందని అన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారంపై దృష్టి సారించాలని ఆదేశించారు. పిల్లల్లో మానవతా విలువలు పెంపొందించాలని, మానసిక ధైర్యాన్ని నింపాలని అన్నారు.

అధికారులతో పాటు తల్లిదండ్రులు కూడా పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, చెడు వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఎల్లప్పుడూ వారిని ఓ కంట కనిపెడుతూ ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు గొండు సీతారాం, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి జి.జయదేవి, దిశా ఎసిపి వివేకానంద, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి.సుధీర్, డిఇఒ ఎల్.చంద్రకళ, బిసి వెల్ఫేర్ అధికారిణి కె.శ్రీదేవి, ఎస్ఎస్ఎ ఎపిసి శ్రీనివాసరావు, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ ఎంఎల్.లలిత, సభ్యులు, సెబ్, జువైనల్, వైద్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

14న పాలస్తీనా సంఘీభావ సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాలస్తీనాకు సంఘీభావంగా ఆవాజ్ విశాఖపట్నం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సును ఈ నెల 14న జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.అస్రఫ్ తెలిపారు. శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఆవాజ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎనిమిది వారాలుగా అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ గాజాలో సృష్టిస్తున్న మారణహోమంలో సుమారు 13 వేలకు మందికిపైగా పాలస్తీనీయులు మరణించారని, వారిలో మూడింట రెండొంతులు పిల్లలు, మహిళలే ఉన్నారని, వేల మంది క్షతగాత్రులు అయ్యారని,. లక్షల మందిని ఇళ్ల నుంచి తరిమేశారని, ఇళ్లు, స్కూళ్లు, ఆసుపత్రులు, చర్చిలు, మసీదులు అన్న విచక్షణ కూడా లేకుండా ఇజ్రాయిల్ సైన్యం, సెటర్ల గ్యాంగులు బుల్డోజర్లతో కూల్చి వేస్తున్నాయని తెలిపారు. ఐక్యరాజ్యసమితి సహాయక శిబిరాలను సైతం ధ్వంసం చేస్తున్నారని, ఈ మారణ హోమాన్ని యావత్తు ప్రపంచం ఖండించిందని పేర్కొన్నారు. తక్షణం ఈ క్రూర యుద్ధోన్మాదాన్ని ఆపాలని ప్రపంచ సమాజం గొంతెత్తి నిరసిస్తోందన్నారు. అయినా అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ ఈ మారణ హోమాన్ని కొనసాగిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో పాలస్తీనీయులకు మద్దతుగా సదస్సు తలపెట్టామని వెల్లడించారు. ప్రజలు, వామపక్ష అభ్యుదయ వాదులు, లౌకికవాదులు, శాంతికాముకులు, కార్మికులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎండి.ఆయూబ్, కోశాధికారి కుజ్ కుహనా, ఎగ్జిక్యూటివ్ మెంబర్ అబ్దుల్ మునీర్ పాల్గొన్నారు.

లైన్లపై కోతి పడడంతో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - సీలేరు : విద్యుత్ లైన్లపై ప్రమాదవశాత్తు కోతి పడడంతో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జంపర్ కట్ అయ్యి సీలేరు గ్రామానికి విద్యుత్ సరఫరా మూడు గంటల పాటు నిలిచిపోయింది. సీలేరు జల విద్యుత్ కేంద్రం వెనుక భాగంలోని స్విచ్ యార్డ్‌లో గల 33 కెవి లైన్‌పై శనివారం ఉదయం 6 గంటలకు కోతి పడింది. విద్యుత్ షాక్‌కు గురైన కోతి తీవ్ర గాయాలతో పారిపోయింది. కోతి పడడం వల్ల షార్ట్ సర్క్యూట్ కావడంతో జంపర్ కాలిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఏపీ జెన్కో సిబ్బంది సీలేరు స్విచ్ యార్డ్‌కు చేరుకొని కాలిపోయిన జంపర్‌ను సుమారు మూడు గంటలపాటు శ్రమించి సరి చేసి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు.

ఎల్ఐసి ఆధ్వర్యాన క్రీడా ఎంపికలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎల్ఐసి డివిజనల్ స్థాయి అథ్లెటిక్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ సెలక్షన్స్‌ను శనివారం ఉదయం విశాఖపట్నంలోని రైల్వే స్టేడియంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎల్ఐసి విశాఖపట్నం సీనియర్ డివిజనల్ మేనేజర్ శారద ప్రసాద్ దాస్ హాజరై ప్రారంభించారు. ఈ ఎంపికలకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలలో ఉన్న సుమారు 20 ఎల్ఐసి శాఖల నుంచి 63 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రామారావు, ఎల్ఐసి స్పోర్ట్స్ ప్రమోషనల్ బోర్డు సభ్యులు డాక్టర్ డివిఎస్‌వై.శర్మ, క్రీడా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కార్యదర్శి జి.వరప్రసాద్, విఆర్‌కె.మూర్తి పాల్గొన్నారు.

ప్రజలతో ఉంటాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలు దక్షిణ నియోజవర్గంలో వాడవాడలా నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే, వైసిపి దక్షిణ ఇన్‌ఛార్జి వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. ఆశీల్‌మెట్ట కార్యాలయంలో శనివారం పార్టీ శ్రేణులతో ఆయన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా మీడియాతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 9 గంటల నుంచి వివిధ సేవా కార్యక్రమాలు మొదలవుతాయన్నారు. వైసిపి మళ్లీ ప్రజల పక్షాన నిలబడుతూ కొత్త ఉత్సాహంతో ముందుకు వెళ్లనుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండా రాజీవ్ గాంధీ, డాక్టర్ మూగి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు తోట పద్మావతి, కొండమ్మ, కోడిగుడ్ల శ్రీధర్, చెన్నా జానకిరామ్ పాల్గొన్నారు.

రథయాత్ర ప్రత్యేక రైలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రథయాత్ర సందర్భంగా పూరీకి వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విశాఖపట్నం-పూరీ రథయాత్ర ప్రత్యేక రైలును విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు శ్రీభరత్, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్‌లు శనివారం మధ్యాహ్నం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ ఈ ప్రత్యేక రైళ్ల ద్వారా భక్తులు పూరీకి హాయిగా ప్రయాణించవచ్చన్నారు.